కోపూరి మాణిక్యమ్మ స్మారక దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

కథ

# కంచె

ఎమ్.వి.వి.ఎస్. సౌమ్య

గాలి నిన్నేగా కొట్టించాను! కానీ బాగా తగ్గిపోయిందేంటీ, ముందు టైర్ నొక్కుకుపోతుంది. పాచ్ పడిందో, వాల్వ్ లూజ్ అయ్యి గాలి పోయిందో. ఇక్కడ దగ్గర్లో సైకిల్ షాపులేమన్నా ఉన్నాయో లేవో అనుకుంటూ చుట్టూ చూసాను. అదృష్టం. పక్కనే ఉంది. కరక్టు చోటుకే వచ్చి ఆగిందనుకుని సైకిల్ తీసుకెళ్ళి స్టాండ్ వేసి నుంచున్నా. అప్పటికే ఎవరితో సైకిల్ టైర్‌కి పాచ్ వేస్తున్నాడు ఓకుర్రాడు.

నన్నుచూసిన వెంటనే నువ్వాపని చేసేరా. 'నేనీపని చూత్తాను' అంటూ నా దగ్గరకి వచ్చి 'అక్కాఏంటి?' అడిగాడు. వాణ్ణిచూస్తే అప్పుడే పుట్టిన లేగదూడలా ఉన్నాడు. కాకపోతే కాస్త నలుపంతే. సరిగ్గా నాసైకిల్ చక్రం అంత ఎత్తే ఉన్నాడు. చొక్కా నిక్కరూ వేసుకున్నాడు. చొక్కా బాగా మాసిపోయి ఉంది. మొత్తానికిముఖం మాత్రం కళగానే ఉంది.

'గాలికొట్టు' అన్నాను.

'అలాగే' అని చెపుతూ గాలిపంపు తీసుకొచ్చాడు.

'పాచ్ పడిందేమో. అది కూడా చెక్ చేసేయ్' అన్నాను.

వాడు అందీ అందకుండా ఉన్న ఆ హేండిల్ బార్ పట్టుకుని స్టాండుని తన్నేడు. అదిరాలేదు. మళ్ళీకొంచెం గట్టిగా తన్నేసరికి వచ్చింది. సైకిల్‌ని నెమ్మదిగా ఆ వైపుకి తీసుకెళ్ళి స్టాండేశాడు. వాల్వ్ స్క్రూ లూజ్ చేసి గాలి బయటికి వదిలేశాడు. వాల్వ్‌ని అటూ ఇటూ చూసి

"దీనికే కన్నం పడ్డా దక్కా దీన్ని మార్చేత్తే సరిపోద్ది" అన్నాడు.

"సరే త్వరగా చేసేయ్" అని చెప్పి నేను ఇంకొకడు ఏం చేస్తున్నాడా అని చూశా. వీడు వాడి కన్నా ఓ రెండేళ్ళు పెద్దోడుంటాడేమో. వాడూ వీడిలాగే ఉన్నాడు. రబ్బరు ముక్క కట్ చేసి దాన్ని కర్రకు చుట్టిన గరుకు రేకుతో సాపుచేసి గమ్ రాసి పాచ్ పడ్డాచోట అతికిస్తున్నాడు. ఇంత చిన్న పిల్లలు పని ఎంతబాగా, చకచకా చేసేస్తున్నారో అనిపించింది. కానీ, ఇంత చిన్న వయసులో చదువుకోకుండా ఈ పనీ గినీ ఏంటీ. ఆటల్లేవు. పాటల్లేవు పాపం. మట్టి కొట్టుకున్నారు. చక్కగా అందరు పిల్లల్లా ఉండడానికి లేదు. వాళ్ళని చూస్తే జాలేసింది.

నా సైకిల్ బాగు చేస్తున్న వాడిని అడిగా "ఏరా ఏమన్నా చదువుతున్నావా?" అని

"ఆఁ.... రెండో కలాసక్కా" అన్నాడు.

"మరి స్కూలు కెళ్ళకుండా ఇక్కడున్నావేంటీ" అడిగాను.

"మా బడి పొద్దుటే ఉంటాది. మజ్జానం నుంచీ సెలవు. అప్పుడు బువ్వ తినేసి అన్నా నేనూ షాపు కొచ్చేత్తాం" చెప్పాడు వాడు.

"మరెప్పుడు చదువుకుంటావు స్కూల్లో మాస్టారు చెప్పినవన్నీనూ?"

"రాత్రి బువ్వ తినేసి చదివేసుకుని పడుకుని పోతాను. మా కలాసులో నేనే ఫస్ట్ అక్కా"

"అబ్బో! వెరీ గుడ్. నీకే సబ్జక్టు బాగా ఇష్టమేంటి?"

"తెలుగు భలే ఉంటుంది కదక్కా, అన్నీ కథలే. లెక్కలయితే పుస్తకం కూడా ముట్టుకోక్కర్లేదు. అన్నీ కూడ్డాలు, తీసేడాలు, గుణించడాలు, భాగెయ్యడాలూనూ. మా స్కూల్లో అయ్యన్నీ ఉప్పుడు నేర్పుతున్నార్గానీ నీకయన్నీ ఎప్పుడో వచ్చేసు", తడుముకోకుండా గడగడా చెప్పేసాడు.

"ఎలాగో?" నా అనుమానాన్ని వ్యక్తపరిచాను.

"షాపుకొచ్చినోళ్ళందరూ డబ్బులిత్తారా. అయ్యి నేను లెక్క చూసుకోవాలా. మిగిలినియ్యి ఇయ్యాలా మరి. అలాగన్న మాట"

అలా మాట్లాడుతూనే ఉన్నాడు. వాడి పని వాడు చేసేసుకుంటున్నాడు. పాత వాల్వ్ ట్యూబ్ పీకేసాడు. కొత్తది కట్ చేసేసాడు. బిగించేసేసాడు. గాలి పంపు తీసుకుని కొట్టడం మొదలెట్టాడు. కొట్టేడు, కొట్టేడు, కొట్టేడు ముందు మొత్తం గాలి తీసేసాడుగా. అది త్వరగా నిండలేదు. వాడికి కొంచెం నీరసం, చిరాకు వచ్చినట్టున్నాయి.

"ఒరే అన్నయ్యా, ఒక్కసారి దాన్ని నొక్కి పట్టుకోరా" అని చెప్పి ఎగిరెగిరి టకటకా కొట్టడం మొదలెట్టాడు. దెబ్బకి నిండిపోయింది.

"చూసేవా అక్కా ఎంత గబగబా కొట్టేసానో!"

"అవున్రోయ్. భలే కొట్టేసావు. ఇంతకీ ఎంతెయ్యమంటావ్?"

"రెండ్రూపాయలక్కా"

వీడి లెక్కల పాండిత్యం గురించి తెగ గొప్పలు చెప్పాడు కదా. ఎంతుందో చూద్దామని పదిరూపాయల నోటిచ్చేను.

"చిల్లర లేదా అక్కా పోన్లే. పది రూపాయలు ఇచ్చేవా. అయితే నీకు ఎనిమిది రూపాయలు వస్తాయాగు" అంటూ జేబులోంచి చిల్లర తీసి, "ఇదిగో అయిదు రూపాయల బిళ్ళ. ఇంకా మూడు రూపాయలు వస్తాయి కదా, ఇదిగో రెండు రూపాయల బిళ్ళ, ఒక రూపాయిదీ. సరిపోయినియ్యా?"

"సరిపోయాయిరా. అయితే నీకు లెక్కలు బాగా వచ్చున్నమాట."

'మరేమనుకున్నావ్' గర్వంగా తలెగరేసాడు వాడు.

'మరి ఉదయమేమో స్కూలుకి వెల్తావ్. తరువాతేమో ఇక్కడికొచ్చేస్తావ్. ఆడుకోవా'

'ఎందుకాడుకోనూ! పనున్నప్పుడది చెత్తా. లేకపోతే టైర్లు దొర్లించుకుంటా బండాట ఆడుకుంటాను.ఇందాకేమో గాలికొడతా గెంతులేశానా!'

వాడిమాటలు వింటుంటే ఎంతో ముద్దనిపిస్తున్నాయి.

'ఇదిగో సైకిలు' అంటూ స్టాండ్ తీయడానికి ట్రై చేసాడు. అయినా రాలేదు. వెంటనే ఆయిల్ తెచ్చి రాసాడు.

"ఇప్పుడు చూడక్కా స్టాండ్ భలే వచ్చేత్తాది" అంటూ స్టాండ్ తీసి సైకిలిచ్చాడు. అప్రయత్నంగానే నా చేతులు వాడి తలని నిమిరాయి. టాటా చెప్పా.

"అలాగే అక్కా టాటా."

× × ×

వచ్చేస్తుంటే ఏదో స్కూల్ బస్ అడ్డమొచ్చింది. ఓ పిల్లాడు దిగాడు. పాపం బాగా అలసిపోయి ఉన్నాడు. యునిఫాం, టై, బెల్టు, షూస్ అన్నీ వేసుకొని బొకేలో చుట్టిన వాడిన పువ్వులా ఉన్నా నీటుగానే ఉన్నాడు. పుస్తకాల బరువుతో పాటూ కారేజీ మోయలేక, మోయలేక మోస్తున్నాడు. ఎదురిల్లే వాళ్ళిల్లనుకుంటా. బేగ్ ఇంట్లో పడేసి బంతితో ఆటలో పడ్డాడు. ఇంతలో వాళ్ళమ్మ అనుకుంటా, వచ్చి బేగ్‌లో ప్రోగ్రెస్ రిపోర్ట్, పేపర్స్ తీసి చూసి తిట్టడం మొదలెట్టింది.

"ఏరా! 5+3+2+1= ---- అంటే టెన్ అని బాగానే వేసావు కదా! 10-2=5+----లో ఏం వెయ్యాలో తెలీదురా. వెధవా. నిన్నిందుకేనా ఇంతింత డబ్బులు పోసి కాన్వెంటులో చదివిస్తున్నది? ఆ సైకిల్ షాపు కుర్రాళ్ళా ఏ దుంపల బడిలోనో పాడేస్తే పోయేది. అది రాయకపోవడం వల్ల ఏడో రాంకులోకి పోయేవు." అంది.

చిరాకునంతా మొహంలోకి తెచ్చుకొని "నీకు గిరి గీసినట్టు ఏం చెయాలో ఏం చెయ్యకూడదో చెప్పినా అర్థం కావడం లేదు. ఆ మోహన్ కేనా ఈ సారి కూడా ఫస్ట్ రాంకు. వాణ్ణి చూసైనా నేర్చుకో. చదువుకోవాలని చెప్తున్నానా. సిగ్గులేకుండా ఆడుకుంటున్నావ్. ట్యూషన్‌కి రడీ అవ్వు" అంటూ గర్జించింది. వాడు దెబ్బకి ఏడుపు మొదలు పెట్టాడు.

"మమ్మీ ఇవాళెళ్ళను. ఆడుకుంటా" అంటూ బతిమలాడాడు.

"చంపుతా వెధవ" అంటూ నాలుగు వడ్డిస్తూనే, రెండు బిస్కెట్లు నోట్లో కుక్కిందామె. వాడు ఏడుస్తూనే బాగ్ తగిలించుకొని ట్యూషన్‌కి రడీ అయ్యాడు. ఏడుస్తూనే బయటకొచ్చాడు. ఏడుస్తూనే నడుస్తున్నాడు.

ఇంతలో సైకిల్ షాపు కుర్రాడు "అరె ఎందుకురా ఏడుస్తున్నావ్? అమ్మ నీ మంచికేగా చెప్పింది! ట్యూషన్‌లో చదివేసుకుంటే రాత్రొచ్చేసి పడుకోచ్చు" అన్నాడు ఓదారుస్తున్నట్టుగా.

అంతే! వాడు అమ్మ మీద కోపాన్ని వీడి మీద చూపిస్తూ "అరె, గిరె ఏంటీ. నీపని నువ్వు చూస్కో" అంటూ పొగరుగా వెళ్ళిపోయాడు. వాణ్ణి చూస్తే నాకు చిరాకొచ్చింది.

× × ×

ఆ పిల్లాడు బడి పాఠాలు మాత్రమే నేర్చుకుంటున్నాడు. అదీ ఏడుస్తూ. ఆ సైకిల్ షాపు కుర్రాడు ఆ పాఠాలతో పాటూ ఇంకేదో నేర్చుకుంటున్నాడనిపించింది.

అవును వాడు బతుకు పాఠాలు నేర్చుకుంటున్నాడు. బతకడం నేర్చుకుంటున్నాడు. జీవించడం నేర్చుకుంటున్నాడు. ఆ సైకిల్ షాపు కుర్రాడిపై జాలిపోయి అభిమానం పెరిగింది. ఆనందంగా అనిపించింది.

× × ×

బయలుదేరుతూ సైకిలెక్కుతుంటే రెండు మొక్కలు కనిపించాయి. రెండూ మొక్కలే. ఒకటి ఇంటి గుమ్మం ముందు కంచెలో ఉంది. ఇంకొకటి దానిక్కాస్త దూరంగా రోడ్డు వార.... దాని చుట్టూ ఏ కంచె లేదు. హాయిగా ఉంది. కంచెలో మొక్కకి నీరుపోసినా సరిగా ఎండ తగలక మోడుగా మారిపోయి నిటారుగా ఉంది. రోడ్డు పక్క మొక్క కాలువ నీటితో బతికేస్తూ ఆకులు తొడిగి గాలికి హాయిగా ఊగుతోంది. ఆకుల బరువుకి కాస్త వంగి ఉంది జ్ఞానవృద్ధుడిలా!



'మచిలీపట్నం, సాహితీమిత్రులు' సభలో వామన కవిత ప్రతిభా పురస్కారం అందుకుంటున్న బత్తుల వి.వి. అప్పారావు, సంస్థ అధ్యక్షులు డా॥ రావి రంగారావు, కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డా॥ జి.వి. పూర్ణచంద్ ప్రభృతులు